

గాయత్రీదేవిగా తలుపులమ్మ



గాయత్రి దేవి అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు

తునిరూరల్, అక్టోబరు 4: జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తుని తలుపులమ్మ లోవ దేవస్థానంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎరేసి.. ఏగేసి..



- సైబర్ వల.. జనం విలవిల
- జిల్లాలో అంతకంతకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలు
- వీటిలో అత్యధికంగా నగదుకు సంబంధించిన ఘోరాలే అధికం
- కలెక్టర్ల దగ్గర నుంచి ప్రముఖుల వరకు నకిలీ వాట్సాప్ డీపీలతో మోసాలు
- ఓటీపీలు, లింకులు, గిఫ్ట్‌ల పేరుతోనూ ఫోన్ల ద్వారా వల వేసి లక్షల్లో గుంజుడు
- అమాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులే లక్ష్యంగా రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- ముంబై పోలీసులమంటూ ఓ భూస్వామి వద్ద గతనెల్లో రూ.1.16కోట్లు స్వాహా
- డబ్బులు కావాలంటూ గత కలెక్టర్ పేరుతో వాట్సాప్‌లో అధికారులకు మెసేజ్‌లు
- తాజాగా ప్రస్తుత కలెక్టర్ షాన్‌మోహన్ డీపీతో తహసీల్దార్లకు డబ్బుల కోసం రిక్వెస్ట్‌లు
- జిల్లాలో 2022లో 54, 2023లో 38, ఈ ఏడాది ఇప్పటివరకు 31 కేసులు నమోదు
- పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో త్వరలో జిల్లాకో సైబర్ పోలీస్‌స్టేషన్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

● హలో.. నేను జిల్లా కలెక్టర్‌ను.. ఓ మీటింగ్‌లో ఉన్నాను.. ఇప్పుడు మాట్లాడ లేను.. అర్జెంట్‌గా డబ్బులు కావాలి.. ఈ నెంబర్‌కు ఫోన్‌పే చేయండి.. గత కలెక్టర్ కృతికాశుక్లా వాట్సాప్ డీపీతో జిల్లా అధికారులకు వచ్చిన వాట్సాప్ మెసేజ్ ఇది.

● హలో.. మేం ముంబై పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నాం. మీపై చాలా కేసులు ఉన్నాయి. అరెస్ట్ చేయడానికి ఈడీ, సీబీఐల నుంచి అనుమతి వచ్చింది. కేసు లేకుండా ఉండాలంటే డబ్బులు కావాలి.. అంటూ పెద్దాపురానికి చెందిన ఓ భూస్వామివద్ద గతనెలలో దఫదఫాలుగా రూ.1.16కోట్లు సైబర్ నేరగాళ్లు లాగేశారు.

● హాయ్ నేను కలెక్టర్‌ను.. అర్జెంట్‌గా ఓ ఫోన్ నెంబర్ మెసేజ్ చేస్తున్నాను. నాకు తెలిసిన వాళ్లు అర్జెంట్‌గా కొంత డబ్బు ఫోన్‌పే చేయండి.. ప్రస్తుత కలెక్టర్ షాన్‌మోహన్ వాట్సాప్ డీపీతో జిల్లాలో కొందరు తహసీల్దార్లకు వెళ్లిన మెసేజ్.

● ఇలా ఒకటేంటి.. నిత్యం ఎన్నో సైబర్‌నేరాలు జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి. చదువుకున్నవారు.. చదువుకోనివాళ్లు.. ఉద్యోగులు, ప్రముఖులు ఇలా ప్రతిఒక్కరూ తెలిసో, తెలియకో సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. ఫోన్లకు వచ్చిన ఓటీపీలను షేర్ చేయడం, గుర్తుతెలియని నెంబర్ నుంచి వచ్చిన లింకులు ఓపెన్ చేయడం, బహుమతుల పేరుతో డబ్బులు కొట్టేయడం, ఏకంగా పాత, ప్రస్తుత కలెక్టర్ల ఫోటోలతో డీపీలు పెట్టుకుని అధికారుల వద్ద డబ్బులు అడగడం.. ఇలా అనేక నేరాలు ఇటీవల జిల్లాలో పెరిగిపోతున్నాయి. గతనెలలో పెద్దాపురంలో ఏకంగా ఓ భూస్వామి రూ.1.16కోట్లు సైబర్ నేరగాళ్లకు చదివించి ఆతర్వాత మోసపోయానంటూ స్టేషన్‌కు వెళ్లాడు. ప్రధానంగా జిల్లాలో 2022లో జిల్లాలో 54, 2023లో 38 సైబర్ కేసులు నమోదవగా, ఈ ఏడాది ఇప్పటివరకు 31 కేసులు నమోదయ్యాయి. త్వరలో జిల్లాలో రాష్ట్రప్రభుత్వం సైబర్ పోలీస్‌స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తుండడంతో బాధితుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

ఎన్ని నేరాలో...

జిల్లాలో సైబర్ నేరాలు క్రమేపీ కోరలు చాస్తున్నాయి. కేవలం నగరాలకే పరిమితమైన ఈ తరహా సైబర్ నేరగాళ్ల దోపిడీలు జిల్లావ్యాప్తంగా విస్తరించాయి. దీంతో అనేక కేసుల్లో బాధితులు కోట్లలో నష్టపోతున్నారు. తీరా జరిగిన ఘోరం తెలుసుకుని పోలీసులను ఆశ్రయించినా నేరగాళ్ల ఆచూకీ అసాధ్యంగా మారుతోంది. మరికొంతమందైతే డబ్బులు పాగొట్టు కున్నాక ఫిర్యాదు చేస్తే పరువు పోతుందనే భయంతో స్టేషన్‌కు వెళ్లడం లేదు. వాస్తవానికి సైబర్ నేరాల్లో తొమ్మిది రకాల వరకు ఉండగా, అత్యధికంగా డబ్బుకు సంబంధించిన కేసులే అధికంగా వెలుగులోకి వస్తున్నాయి. ఆ తర్వాత మహిళలను ఫోన్లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంల్లో వేధించిన కేసులు వస్తున్నాయి. ప్రధానంగా జిల్లాలో ఇద్దరు కలెక్టర్ల పేరుతో సైబర్ నేరగాళ్ల వలవేయడం సంచలనంగా మారింది. 2022, సెప్టెంబర్‌లో అప్పటి కలెక్టర్ కృతికాశుక్లా ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు పలువురు జిల్లా అధికారులకు మెసేజ్ చేశారు. కలెక్టర్ చాట్ చేస్తున్నట్లు తాను మీటింగ్‌లో ఉన్నందున మాట్లాడలేనని, డీపీగా ఉన్న ఫోన్ నెంబర్‌కు అర్జెంట్‌గా డబ్బులు పంపాలని కోరారు. కొందరు అధికారులు నిజమేననుకుని డబ్బులు పంపారు. ఆ తర్వాత నేరుగా కలెక్టర్‌కు విషయం చెప్పగా అది సైబర్ నేరగాళ్ల పనిగా తేలింది. దీంతో కలెక్టర్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు యూపీ నెంబర్‌గా గుర్తించారు. నిందితులు కూడా అక్కడివారేనని తేల్చారు. కిందటి నెలలో ప్రస్తుత కలెక్టర్ షాన్‌మోహన్ డీపీతో జిల్లాలో కొందరు తహసీల్దార్లకు సైబర్ నేరగాళ్లు అర్జెంట్‌గా తమ వారికి డబ్బులు పంపాలని కోరారు. తీరా ఆరాతీస్తే అదికూడా యూపీనుంచి నేరగాళ్లు ఈ మోసానికి దిగినట్లు తేలింది.

ఇకపై జిల్లాకో సైబర్ పోలీస్‌స్టేషన్..

సైబర్‌నేరాలు అంతకంతకూ పెరుగుతుండడంతో కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ కేసులను ఛేదించడం కష్టమవుతుండడం, దానికి తగ్గ సాంకేతిక పరిజ్ఞానం చాలామంది పోలీసు సిబ్బందిలో లేకపోవడం కూడా కేసుల్లో పురోగతి కనిపించడం లేదు. పైగా అసలు నేరగాడు ఎక్కడ ఉంటాడో కూడా కనిపెట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో త్వరలో జిల్లాకు ప్రత్యేకంగా సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నేరానికి సంబంధించి దొంగలను పట్టుకోవడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సిబ్బందికి అందివ్వబోతోంది. సాంకేతికంగా పరిజ్ఞానం ఉన్న పోలీసులను గుర్తించడం, వారికి కొంత శిక్షణ ఇవ్వడం ద్వారా సిబ్బందిని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో నియమించనుంది. బాధితులు ఫిర్యాదు చేయడానికి వచ్చేలా ప్రోత్సహించడం, ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే ఆన్‌లైన్‌లో సైబర్ నేరగాళ్ల ఆచూకీ కనిపెట్టడం, అవసరాన్ని బట్టి ఆయా చిరునామాకు వెళ్లేలా కొత్త జిల్లా సైబర్ పోలీస్‌స్టేషన్‌ను అన్నిరకాల పరిపుష్టి చేయనున్నారు.

సీబీఐ, ఈడీ పేరుతో నమ్మించి..

గతనెల్లో పెద్దాపురానికి చెందిన ఓ భూస్వామికి ముంబై పోలీసుల పేరుతో ఫోన్‌కాల్ వచ్చింది. మీపై ఉన్న పాతకేసులకు సంబంధించి సీబీఐ, ఈడీ నుంచి అరెస్ట్ వారెంట్‌లు జారీ అయ్యాయని, వస్తున్నామంటూ ఫోన్‌చేశారు. దీంతో బెంబేలెత్తిన సదరు బాధితుడు వారితో మాట్లాడగా అరెస్ట్ చేయకుండా ఉండేందుకు ఆగస్టు 18 నుంచి సెప్టెంబరు 9 వరకు దఫదఫాలుగా రూ.1.16కోట్లు వసూలు చేశారు. తీరా మోసపోయానని గ్రహించిన బాధితుడు ఇటీవల పెద్దాపురం స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతనెలలో గండేపల్లికి చెందిన ఓ వ్యక్తి ఫోన్‌కు ఏదో లింకు వస్తే ఏంటోనని ఓపెన్ చేశాడు. తీరా చూస్తే క్షణాల్లో రూ.2.50లక్షలు బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో కంగుతిన్నాడు. ఇలా ఎక్కడికక్కడ నిత్యం సైబర్‌నేరగాళ్లు మోసం చేస్తూనే ఉన్నారు. ప్రధానం రిటైర్ అయిన ఉద్యోగుల నుంచి వ్యాపారులు, నిరక్షరాస్యులు ఈ తరహా మోసాలతో ఎక్కువగా నష్టపోతున్నారు. వివిధ రకాల గేమ్ యాప్‌ల నుంచి సైతం డబ్బులు సైబర్ నేరగాళ్లు జనంనుంచి లాగేస్తున్నారు.

లింకు తెరవకపోతే పథకాలు ఆగిపోతాయని..

ప్రధానంగా జిల్లాలో బ్యాంకుల పేరుతో ఫోన్‌లు చేసి ఓటీపీలు తెలుసుకుని లాగేసిన డబ్బు కోట్లలో ఉంటుంది. లింకులు పంపి, అవి తెరవకపోతే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని బెదిరించి డబ్బులు ఖాళీ చేసేసిన కేసులు సైతం చాలా నమోదయ్యాయి. ఇలా జిల్లాలో ఏటా ఇవి పెరిగిపోతున్నాయి. కానీ బాధితుల్లో సగానికిపైగా ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. అటు ఫిర్యాదు చేసినా డబ్బులు రావనే కారణంతో స్టేషన్ మెట్లు ఎక్కడం లేదు. కొందరైతే ముందుకు వచ్చి సైబర్ నేరగాళ్లను పట్టుకోవాలంటూ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో 2022లో ఏకంగా 54 సైబర్ కేసులు నమోదయ్యాయి. 2023లో 38 దాఖలయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 31కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి ఇవన్నీ వందల్లోనే ఉన్నాయి. కానీ బాధితులు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేక ఫిర్యాదులకు ముందుకు రావడం లేదు. కొన్ని సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నా నేరగాళ్లు ఎవరనేది గుర్తించడం చాలా కష్టమవుతోంది. దీంతో బాధితులు సైతం కొంతకాలం తర్వాత కేసు సంగతి వదిలేస్తున్నారు.

బాలాత్రిపుర సుందరిగా పాదగయ రాజరాజేశ్వరీదేవి



పిఠాపురం పాదగయ క్షేత్రంలో బాలాత్రిపురసుందరి అలంకారంలో దర్శనమిస్తున్న రాజరాజేశ్వరీదేవి

పిఠాపురం, అక్టోబరు 4: పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామివారి సన్నిధిలోని రాజరాజేశ్వరిదేవికి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం బాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రీపీఠంలో ఆధ్యాత్మిక శోభ

- మహాశక్తి యాగంలో వేలమంది మాతృమూర్తులు



కాకినాడ శ్రీపీఠంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబికా

డీపీవో రవికుమార్ బాధ్యతల స్వీకరణ



కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 4: జిల్లా పంచాయతీ అధికారిగా వి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన బాపట్ల జిల్లా ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ డీపీవోగా ఉన్న కె.భారతి సౌజన్య రిలీవ్ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌కు కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు అభినందనలు తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని, సమస్యలు తలెత్తకుండా చూస్తామని రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, సుజాత, ప్రకాష్, శ్రీనివాస్, కార్యదర్శులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీపీవో

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 4: జిల్లా పంచాయతీ అధికారిగా నియమితులైన వి.రవికుమార్ శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

అటవీశాఖ అధికారుల బదిలీలు

దివాన్‌చెరువు/కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 4: జిల్లాలోని పలువురు అటవీశాఖ అధికారులు బదిలీ అయ్యారు. దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్‌గా మంగళగిరిలోని ఎఫ్‌యువో నుంచి బి.విజయ్‌కుమార్‌ను బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ అటవీ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.కృష్ణప్రియ ఇక్కడనుంచి బదిలీ అయ్యారు. శ్రీశైలంలోని ప్రాజెక్టు టైగర్‌లో ఫీల్డ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బి.ఎన్.ఎన్.మూర్తిని రాజహేంద్రవరం కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా బదిలీ అయ్యారు. రాజమహేంద్రవరంలోని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పనిచేస్తున్న వైశ్రీనివాసరెడ్డి పీసీసీఎఫ్ కార్యాలయంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(జూపార్క్)కు బదిలీ అయ్యారు. డీఎఫ్‌వో ఎస్.భరణిని బదిలీ చేసి ఆ స్థానంలో శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్‌వో డి.రవీంద్రనాథ్‌రెడ్డిని కాకినాడ జిల్లా డీఎఫ్‌వోగా నియమించారు. భరణిని చిత్తూరు జిల్లా డీఎఫ్‌వోగా బదిలీ చేశారు. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

6, 7 తేదీల్లో ఆర్టీసీ బస్‌పాస్‌లు నిలిపివేత

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 4: కాకినాడ ఆర్టీసీ బస్సు డిపోలో ఇస్తున్న విద్యార్థుల, ఇతర పాసుల వెబ్‌సైట్ ఈనెల 5,6 తేదీల్లో సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ చేయడంవల్ల పాస్‌లు నిలిపివేసినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. తిరిగి యథావిధిగా ఈనెల 7 నుంచి బస్సు పాస్‌లు కౌంటర్‌లో ఇస్తామన్నారు.

గ్రామీణ రహదారులకు.. మహర్దశ

- జిల్లావ్యాప్తంగా పల్లెల్లో రోడ్ల నిర్మాణాలకు ఉపాధి హామీ నిధులు రూ.80కోట్లు విడుదల
- మండలానికి రూ.3 కోట్ల చొప్పున కేటాయింపు
- 14నుంచి పనులు ప్రారంభం

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 4: జిల్లాలో గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లకు మహర్దశ పట్టుకుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.80కోట్లు విడుదల య్యాయి. దీంతో గ్రామీణులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 385 గ్రామ పంచాయతీలున్నాయి. గత అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించిన పాపాన పోలేదు. దీంతో రోడ్లు గుంతలు పడి ధ్వంసమయ్యాయి. డ్రైన్లు లేక మురుగునీరు రోడ్లపై నిలిచిపోయింది. దీంతో గ్రామీణులు అనేక ఇబ్బందులు పడ్డారు. రోడ్లు ధ్వంసమవ్వడంవల్ల పెద్దఎత్తున రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ రోడ్లపై దృష్టిసారించింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులును వెచ్చించింది. జిల్లాకు రూ.80కోట్లు నిధులు విడుదల చేసింది. జిల్లాలో 21 మండలాలు ఉండగా ఒక్కొక్క మండలానికి రూ.3కోట్ల నుంచి రూ.4కోట్ల వరకు కేటాయించారు. ఈ పనులను ఈ నెల 14వతేదీ నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. పల్లెపండుగ కార్యక్రమం ద్వారా ఈ పనులను పల్లెల్లో ప్రారంభిస్తారు.

గ్రామసభల్లో ఆమోదించిన పనులే

ఈ ఏడాది ఆగస్టు 23న జిల్లాలో గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనులను ఆమోదించారు. వాటినే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్ల పర్యవేక్షణలో ప్రారంభిస్తారు. ఐదేళ్లపాటు నరకం చూపించిన రోడ్లు, డ్రైన్లు సమస్య ఇక తీరనుందని పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పనులు వేగంగా చేసేలా కార్యాచరణ: కలెక్టర్

జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు నిధులు విడుదలయ్యాయి. ఈ నిధుల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను వేగంగా నిర్మించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. జిల్లాలో రహదారులు అత్యంత అధ్వానంగాఉన్న మండలాలకు నిధులు అధికంగా కేటాయించాం.

నేర పరిశోధనలో జిల్లా పోలీసులకు అవార్డు

- ఉత్తరకంచి బ్యాంకు దోపిడీ కేసు ఛేధించిన పోలీసు అధికారులకు రాష్ట్రంలో మొదటిస్థానం



బ్యాంకు కేసు ఛేధించిన అప్పటి ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ప్రత్తిపాడు సీఐలు, ఎస్ఐలు అవార్డు అందించిన డీజీపీ

కాకినాడ క్రైం/ప్రత్తిపాడు, అక్టోబరు 4: అతిక్లిష్టమైన కేసుల్లో అధునాతన విధానాలను అనుసరించి ఛేదించిన సంఘటనలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కాకినాడ ఎస్పీగా పనిచేసిన సుబ్రమణి సతీష్‌కుమార్‌కు ప్రత్యేకఅవార్డును బహూకరించి అభినందించింది. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంకు దోపిడీ కేసును చాకచక్యంగా ఛేదించిన అప్పటి జిల్లా పోలీసు అధికారులకు శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు, వెస్ట్ ఇన్ క్రైం డిసెక్టర్(ఏబీసీడీ) అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కేసులో అప్పటి ఎస్పీ సతీష్‌కుమార్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్ సవాలుగా తీసుకుని ఆంధ్ర, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లోని నిందితులను గాలించి అరెస్ట్ చేసి చోరీ సొత్తు రికవరీ చేశారు. అత్యాధునిక విధానాలను పాటించి వినూత్న మార్గాలను అనుసరించి ఈ కేసును ఛేధించడంలో వీరంతా విశేష కృషి చేశారు. దీంతో డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఆయన కార్యాలయంలో వారికి ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేశారు. రాష్ట్ర పోలీస్‌శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతిఒక్కరు వృతి నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ పెంపొందించుకోవాలని, తద్వారా కేసులు త్వరితగతిన ఛేధించేందుకు దోహదపడతాయని డీజీపీ అన్నారు.

పొలాల్లో ఇసుక మేటలు తొలగించేందుకు తోడ్పాటు

- ఉపాధి హామీ పథకం ద్వారా అవకాశం
- పరిశీలన జరిపిన డ్వామా పీడీ వెంకటలక్ష్మి



పిఠాపురం మండలం రాపర్తి వద్ద పొలాల్లో వేసిన ఇసుకమేటలు పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

పిఠాపురం, అక్టోబరు 4: ఏలేరు వరదల కారణంగా కాలువలకు గండ్లు పడి పొలాల్లో వేసిన ఇసుక మేటలను తొలగించుకునేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు తోడ్పాటు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి రైతుకు రెండు ఎకరాల వరకూ ఈ పథకం ద్వారా సహకారం అందించనున్నారు. పొలాల్లో వేసిన ఇసుక మేటలను తొలగించి మూడు కిలోమీటర్ల వరకూ రవాణా చేసేందుకు, ఆ స్థానంలో నాణ్యమైన మట్టిని(పంటలు సాగుకు అనుకూలమయిన మట్టి) ఐదు కిలోమీటర్ల పరిధి నుంచి తెచ్చుకునేందుకు అయ్యే వ్యయాన్ని ఉపాధి పథకం ద్వారా రైతులకు అందించనున్నారు. దీనివల్ల పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి తదితర మండలాల్లో ఇసుకమేటలు వేసి నష్టపోయిన రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించేందుకుగాను డ్వామా పీడీ వెంకటలక్ష్మి శుక్రవారం ఏలేరు పరివాహక ప్రాంతంలో గండ్లు పడి ఇసుకమేటలు వేసిన ప్రాంతాల్లో పర్యటించారు. పిఠాపురం మండలం రాపర్తి వద్ద పంటపొలాలను, అక్కడ వేసిన ఇసుకమేటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఇసుక తొలగింపు, తరలింపు, మట్టిని తీసుకుని వచ్చేందుకు అయ్యే వ్యయం తదితర అంశాలపై వారితో మాట్లాడారు. ఇందుకు సంబంధించి ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.

మద్యం దుకాణాలకు 21 దరఖాస్తులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 4: జిల్లాలో మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 21 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 155 మద్యం దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మద్యం పాలసీ ప్రకారం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కుమారి తెలిపారు.

ప్రాణాలు తీసిన ఈత

- ఆడుకోవడానికని వెళ్లి.. అనంతలోకాలకు..
- పంట కాలువలోకి ఈతకోసం దిగి ఇద్దరు విద్యార్థుల మృతి
- కాకినాడ రూరల్ తూరంగి గ్రామంలో విషాదఛాయలు

రూరల్

నైపుణ్యత మెరుగు దిశగా విద్యాబోధన సాగాలి

- హోంమంత్రి వంగలపూడి అనిత
- ముగిసిన అంతర్ రాష్ట్ర బాలికల కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిప్



హోంమంత్రి అనితను సన్మానిస్తున్న శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు



ఎంపికైన విద్యార్థులతో హోంమంత్రి అనిత

తుని రూరల్, అక్టోబరు 4: విద్యార్థుల నైపుణ్యత మెరుగుపరిచే దిశగా విద్యాబోధన సాగాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో జరిగిన క్లస్టర్-1 అంతరాష్ట్ర బాలికల కబడ్డీ, వాలీబాల్ చాంపియన్‌షిష్ ముగింపు వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడురోజులుగా జరిగిన ఈ పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి 100కు పైగా పాఠశాలల నుంచి 1200మంది పైబడి క్రీడాకారులు పాల్గొని క్రీడాస్ఫూర్తి చాటారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడారు. విద్యార్థులు చదివితేనే తెలివైన వారు కాదని, చదవకుంటే తెలివి తక్కువవారు కాదని, ఏ రంగంలో రాణించినా తెలివైన వారని ఆమె తెలిపారు. ఆడపిల్లలు తలవంచుకునేలా కాకుండా అన్యాయం జరిగినప్పుడు తిరగబడేలా ఉండాలన్నారు. క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని ఆ దిశగా శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలు ముందుకు సాగడం అభినందనీయమన్నారు. చదువు, క్రమశిక్షణ, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు సంస్థాగత నైపుణ్యాలు నేర్పే విద్యాలయాల్లో శ్రీ ప్రకాష్ ముందుంటుందని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. గౌరవఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎన్.సూర్యారావు మాట్లాడుతూ చదువులతోపాటు క్రీడలకు విద్యాసంస్థలు ఇస్తున్న ప్రాధాన్యంవల్లే ప్రతిష్ఠాత్మక రాష్ట్రస్థాయి పోటీలు ఈ ఏడాది శ్రీప్రకాష్‌లో జరగడానికి కారణమన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్ మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమాన దృష్టిలో చూసే ఆలోచనా దృక్పథం విద్యార్థులు అలవరుచుకునేందుకు ఆటలు దోహదపడతాయని, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు మంచి ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు జాతీయస్థాయికి అర్హత పొందుతారన్నారు. అనంతరం విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, హోంమంత్రి అనితను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. గెలుపొందిన వారికి మెడల్స్, జ్ఞాపికను అందజేశారు. పాఠశాలల నుంచి విద్యార్థులు, కోచ్‌లు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

విజేతలు వీరే..

మూడురోజులపాటు హోరాహోరీగా జరిగిన అంతర్ రాష్ట్ర బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14 కబడ్డీ విభాగంలో అనకాపల్లి జిల్లాకు చెందిన పాయకరావుపేటలోని శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ కబడ్డీలో ప్రథమస్థానంలో నిలిచింది. తెలంగాణాలోని భువనగిరికిచెందిన న్యూడైమెన్షన్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారు.

- అండర్-17 కబడ్డీ విభాగంలో కృష్ణా జిల్లా నరసింగపాలెం, హీల్ స్కూల్ ప్రథమస్థానం, తెలంగాణ మేడ్చల్ జిల్లా కొండపూరా ప్రబోధానంద ప్రశాంతినికేతన్ స్కూల్ ద్వితీయ బహుమతి సాధించాయి.
- అండర్-19 కబడ్డీ పోటీల్లో ఖమ్మం జిల్లా ఖమ్మంకు చెందిన హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానం, హైదరాబాద్ ది హార్ట్‌ఫుల్ లెర్నింగ్ సెంటర్ స్కూల్ ద్వితీయస్థానం సాధించాయి.
- వాలీబాల్ అండర్-14 విభాగంలో మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి నిజాంపేట సంఘ మిత్ర స్కూల్ ప్రథమ బహుమతి, మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి డీపీవీ పబ్లిక్ స్కూల్ ద్వితీయ బహుమతి సాధించాయి.
- వాలీబాల్ అండర్-17 విభాగంలో నెల్లూరుకు చెందిన నవనీత పబ్లిక్ స్కూల్ ప్రథమ బహుమతి, అనంతపురం మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ ద్వితీయ బహుమతి సాధించాయి.
- వాలీబాల్ అండర్-19 విభాగంలో మేడ్చల్ నాచారం డీపీఎస్ స్కూల్ ప్రథమ బహుమతి, నెల్లూరు అక్షరవిద్యాలయం ద్వితీయ బహుమతి సాధించాయి.

గాయత్రీదేవిగా మాణిక్యాంబ అమ్మవారు

- రెండో రోజు శరన్నవరాత్రి ఉత్సవాలు



గాయత్రీదేవి అవతారంలో మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, అక్టోబరు 4: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండోరోజు శుక్రవారం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ద్వాదశశక్తి పీఠం మాణిక్యాంబ అమ్మవారు వేదమాత గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాణిక్యాంబ సన్నిధిలో విశేష కుంకుమార్చనలు, శ్రీచక్రనవావర్ణార్చన, సాయంత్రం లక్ష కుంకుమార్చన, సువర్ణ, రజత పుష్పార్చనలు జరిగాయి. మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

జాతీయ యోగా పోటీల్లో రోహిణికి కాంస్యం



కానిస్టేబుల్ రోహిణిని అభినందిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలోని సైబర్ ల్యాబ్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.రోహిణి జాతీయస్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో రెండోసారి కాంస్య పతకం సాధించారు. ఛత్తీస్‌గడ్‌లోని బిలాయ్‌లో ఆలిండియా పోలీసు క్లస్టర్ ఛాంపియన్ షిప్ 2024-25 పేరుతో ఈపోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహకిషోర్ ఆమెను అభినందించారు. జాతీయస్థాయిలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) అల్లూరి వెంకట సుబ్బరాజు పాల్గొన్నారు.

సినీ నిర్మాత దామిశెట్టి మృతి



నళినీరంజనరావు

ద్రాక్షారామ, అక్టోబరు 4: సినీ నిర్మాత, నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు దామిశెట్టి నళినీ రంజనరావు(85) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పదహారేళ్ల వయస్సు, పల్లెటూరి మొనగాడు చిత్రాల నిర్మాతల్లో నళినీరంజనరావు ఒకరు. పదహారేళ్ల వయస్సు సినిమా అప్పట్లో ఘనవిజయం సాధించింది. పదహారేళ్ల వయస్సు సినిమా ద్రాక్షారామ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ చేశారు.

వ్యాన్ ఢీకొని బీటెక్ విద్యార్థిని మృతి

- మరో యువతికి గాయాలు
- బూరుగుపూడి వద్ద ఘటన




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకట దీప్తి

కోరుకొండ, అక్టోబరు 4: తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థిని మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన జుజ్జవరపు వెంకటదీప్తి(18), ఆమె స్నేహితురాలు మేకల అనూష కాకినాడజిల్లా సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.ఇద్దరూ రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శనానికి స్కూటీపై వస్తుండగా కోరుకొండ నుంచి రాజమహేంద్రవరంవైపు వెళుతున్న టాటా ఏస్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో దీప్తి తలకు బలమైన గాయం కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందగా అనూషకు మణికట్టు వద్ద విరిగి గాయమైనట్టు ఎస్ఐ శ్యామసుందర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మండపేట వాసి మృతి

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు
- గ్రీన్‌చానల్ ద్వారా విశాఖకు తరలింపు



రెడ్డి కళ్యాణ చక్రవర్తి(ఫైల్)

మండపేట, అక్టోబరు4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన రెడ్డి కళ్యాణచక్రవరి (53) ఈనెల 2న మండపేట నుంచి రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి మండపేటకు వస్తుం డగా రాజనగరం మండలం తుంగపాడు వద్ద రోడ్డు గోతులో పడి ప్రమాదానికి గురై తలకు తీవ్రగాయమైంది. ఆయనకు మెరుగైన వైద్యం కోసం ఆయన కుటుంబ సభ్యులు కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్సకోసం హుటాహుటిన తరలించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన వైద్యులు రెండోరోజు చక్రవర్తికి బ్రెయిన్‌డెడ్ అయిందని నిర్ధారించారు. చక్రవర్తికి భార్య, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. కుటుంసభ్యులకు అవయ వదానం గురించి తెలుసుకుని ఆయన అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. వారి అంగీకారం మేరకు వైద్యులు చక్రవర్తికి ఆపరేషన్ చేసి అవయవాలను ప్రత్యేక వాహనంలో గ్రీన్‌చానల్ ద్వారా విశాఖకు శుక్రవారం తరలించారు. మరణించి కూడా మరికొంతమంది జీవితాల్లో వెలుగులు నింపిన చక్రవర్తి మరణించినా కూడా చిరంజీవిగానే మిగి లాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పుట్టెడుబాధలో కూడా కుటుంబ సభ్యులు పెద్దమనస్సుతో అవయవదానం చేయటం పట్ల వారి ఉదారతను పట్టణ ప్రజలు ప్రశంసించారు. చక్రవర్తి అవయవదానం అనంతరం శుక్రవారం మండపేటకు తీసుకువచ్చి కుటుంబసభ్యులు బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.



ప్రవచిస్తున్న స్వామి పరిపూర్ణానంద సరస్వతి, కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

శ్రీపీఠంలో ఆధ్యాత్మిక శోభ

- మహాశక్తి యాగంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు
- దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబికా దేవి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 4 : దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా కాకినాడ శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాశక్తి యాగం-2024లో వేలాది మాతృమూర్తుల మధ్య భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా సాగుతోంది. శ్రీపీఠం నిర్వాహకులు స్వామీ పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం ఐశ్వర్యాంబిక అమ్మవారిని దుర్గాదేవి రూపంలో అలంకరణచేసి దుర్గా సూక్త, ప్రత్యంగిరా హోమం ఘనంగా నిర్వహించారు. శతకోటి కుంకుమార్చన, లలిత పారాయణం చేశారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ పారాయణం చేశారు. శతకోటి కుంకుమార్చన మహాక్రతువులో రెండు రోజుల్లో 16 కోట్ల కుంకుమార్చన మంత్రోచ్ఛరణ జరిగిందని, పదిరోజుల్లో 100 కోట్లకుపైగా చేరుకుంటుందన్నారు. మహాశక్తియాగంలో వేలాది మాతృమూర్తులు గొప్ప సంకల్పంతో ఎరుపు దీక్షా వస్త్రాలు ధరించి ఐశ్వర్యాంబిక అమ్మవారు రూపంలో ఈ క్రతువులో పాల్గొంటున్నారని, ఇదంతా అమ్మ అనుగ్రహమేనన్నారు. అయోధ్యకు తీసుకెళ్లేందుకు వెళుతోన్న శ్రీరాముని చేతిలో ఉండే వెండి ధనస్సు, బంగారు బాణం శ్రీపీఠానికి శనివారం భక్తుల సందర్శనార్థం వస్తున్నాయని, వీటికి ప్రత్యేకంగా సంకల్ప సిద్ధి అనంతరం అయోధ్యకు నిర్వాహకులు తీసుకెళతారన్నారు.శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఈనెల 9వ తేదీన 24 వేల మంది విద్యార్థులతో ఒకేప్రాంగణంలో 3 కోట్ల త్రికోటి మహా సరస్వతీ పూజా కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. సాయంత్రం పవిత్ర లక్షార్చన కార్యక్రమంలో భాగంగా భక్తులు తీసుకొచ్చిన లక్ష పసుపు కొమ్ములతో పసుపు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సం గీత కచేరి, కేరళ డప్పు కళాకారులు చేసిన ప్రదర్శన భక్తులను షైమరపించాయి. ఏపీ, తెలంగాణా, బెంగళూరు తదితర రాష్ట్రాల నుంచి సుమారు 30 వేల మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



దుర్గాదేవిగా దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబికా

ఘనంగా దేవీచౌక్ శరన్నవరాత్రి మహోత్సవాలు



రాజమహేంద్రవరంలో దేవీచౌక్ వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 4: రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని బాలత్రిపుర సుందరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం కుంకుమ పూజలు నిర్వహించారు. రెండో రోజు అమ్మవారు గ్రాయత్రీదేవి ఆలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం కావడంతో భక్తులు ఉదయం నుంచి రాత్రి 10గంటలకు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి మంగళవాయిద్యాలతో అఖం డ హారితిని ఇచ్చారు. అమ్మవారిని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు.

లక్ష్మీదేవిగా రత్నగిరి దుర్గలు

అన్నవరం, అక్టోబరు 4: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రత్నగిరి క్షేత్ర రక్షకిలుగా పూజలందుకుంటున్న వనదుర్గ, కనకదుర్గలు రెండో రోజైన శుక్రవారం లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అష్టైశ్వర్యాలను ప్రసాదించే దేవతగా అమ్మవారిని అలంకరించగా భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.



లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన రత్నగిరి దుర్గలు

కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- మొదటి అంతస్తు నుంచి పడిపోయిన ఇద్దరికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



గాయపడిన పంతం సత్తిబాబు

కొవ్వూరు, అక్టోబరు 4 : తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో పోలీసులు జరిపిన దాడిలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా మారింది. కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం నుంచి వచ్చిన ప్రత్యేక పోలీసు బృందం దాడి చేసింది. ఈదాడిలో 30మంది పారిపోగా, ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.5,800 నగదు, కొన్ని కాయిన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్లబ్‌లో రమ్మీ పేకాట ఆడుతున్న సందర్భంలో పోలీసులు పేకాటరాయుళ్లపై దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురిచేసినట్టు క్లబ్ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ దాడిలో ఇరువురు వ్యక్తులు భవనం మొదటి అంతస్తు నుంచి కిందకు పడిపోయారు. వీరిలో కాకినాడకు చెందిన పంతం సత్తిబాబు తలకు తీవ్ర రక్తగాయమై చెవి నుంచి రక్తం కారింది. వెంటనే ఈయనను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అలాగే కొవ్వూరుకు చెందిన కాగిత సుభాష్ చంద్రబోస్‌కు కాలు విరిగింది. సుభాష్ చంద్రబోస్ కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలిసిన వెంటనే టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు క్లబ్ చేరుకున్నారు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం సీసీ కెమెరాల పర్యవేక్షణలో కాలక్షేపం కోసం జరుగుతున్న ఈ వ్యవహారంపై జిల్లా ఎస్పీ, పోలీసులు వ్యవహరించిన తీరుపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, హోంమంత్రి వంగలపూడి అనితలకు వీరు ఫిర్యాదుచేశారు.

మృత్యువులోనూ వీడని పేగుబంధం

- కుమారుడి మరణవార్తతో కన్నతల్లి గుండె ఆగింది
- అంబాజీపేటలో విషాదఛాయలు
- ఒకేసారి అంత్యక్రియలు...



అంబాజీపేటలో తల్లి, కొడుకుల మృతదేహాలు

అంబాజీపేట, అక్టోబరు 4: మృత్యువులోనూ పేగుబంధం వీడలేదు. కుమారుడు మరణవార్తతో కన్నతల్లి గుండె బద్దలైంది. ఒకేరోజు ఇద్దరి మృతితో ఆ ఇంట తీవ్ర విషాదం చోటుచేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అంబాజీపేటకు చెందిన మద్దింశెట్టి ఆదిబాబు(46) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కొడుకు మరణవార్త విని తట్టుకోలేని ఆ తల్లి గుండె ఒక్కసారిగా బరువెక్కింది. దీంతో తల్లి మద్దింశెట్టి మహాలక్ష్మి(72) ఒక్కసారిగా కుప్పకూలిపోగా స్థానికులు వెంటనే ఆమెను హుటాహుటిన అంబులెన్స్‌లో ఆమెను ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో మృతిచెందారు. మహాలక్ష్మికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరు కుమారులు గతంలోనే మృతి చెందగా, ఒక కుమారుడు తప్పిపోయాడు. ఇప్పుడు మిగిలిన కుమారుడు ఆదిబాబు మృతి చెందడంతో ఆమె తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదిబాబు గతంలో చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడిగా, అయ్యప్ప గురుస్వామిగా, ఇందుపల్లి ఏ-1 కన్వెన్షన్ హాలు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య మద్దింశెట్టి లక్ష్మీ పార్వతీదేవి మాచవరం 4వ వార్డు సభ్యురాలిగా పనిచేస్తున్నారు. ఆదిబాబు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అనంతరం ఇద్దరు భౌతికకాయాలను అంతిమయాత్ర నిర్వహించి ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

- పోలవరం నిర్వాసితుల గృహాలు పరిశీలించిన ప్రాజెక్టు సీఈవో

దేవీపట్నం, అక్టోబరు 4: పోలవరం ముంపునకు గురై నిరాశ్రయులైన దేవీపట్నం, పూడిపల్లికి చెందిన గిరిజనేతరుల కోసం గోకవరంలో నిర్మిస్తున్న గృహ సముదాయాలను శుక్రవారం పోలవరం ఇరిగేషన్ ప్రాజె క్టు సీఈవో అతుల్ జైన్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా సీఈవో అతుల్‌జైన్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురై నిర్వాసితులుగా మారిన గిరిజనేతరులకు ఎటువంటి నష్టం లేకుండా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ప్రస్తుతం 770 ఇళ్ల నిర్మిస్తున్నామన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ, సీఈ రాజేష్‌కుమార్, కార్యదర్శి యం.రఘురాం, డీడీఎం రవి, డీడీడీఎస్ ప్రసాద్, తహసీల్దార్ రామకృష్ణ ఉన్నారు.

సీఈవోను అడ్డుకున్న పోలవరం నిర్వాసితులు

గోకవరం గంగాలమ్మతల్లి సమీపంలో దేవీపట్నం, పూడిపల్లి గ్రామాల ప్రజలకు నిర్మిస్తున్న గృహాలను సందర్శించేందుకు వచ్చిన ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను గోకవరం ప్రధాన రహదారిపై పూడిపల్లి గ్రామ నిర్వాసితులు అడ్డుకున్నారు. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ కాలనీ నిర్మాణం పూర్తికాలేదని బయట ఇళ్లల్లో అద్దెకుంటూ జీవనం కొనసాగిస్తు న్నామని అర్హులైన వారిని జాబితాలో చేర్చకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులు సుమారు అరగంటసేపు రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు రంగప్రవేశం చేసి నిర్వాసితులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. దీంతో సీఈవో కారు ముందుకు కదిలింది.



అధికారులతో మాట్లాడుతున్న సీఈవో అతుల్‌జైన్

కనకదుర్గమ్మకు స్వర్ణ కిరీటం అలంకరణ



అమ్మవారికి అలంకరించిన నవరత్న ఖచిత స్వర్ణకిరీటం

గోకవరం, అక్టోబరు 4: తూర్పుగోదావరిజిల్లా గోకవరంలోని దేవీచౌక్ సెంటర్‌లో శ్రీకనకదుర్గమ్మకు నవరత్న ఖచిత బంగారు స్వర్ణ కిరీటం అలంకరణ శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు సహకారంతో సమకూర్చిన, రూ.21లక్షల విలువైన 250గ్రాముల బంగారంతో తయారు చేసిన ఈ స్వర్ణ కిరీటాన్ని శరన్నవరాత్రి మహోత్సవాలు రెండోరోజున అమ్మవారికి అలంకరించారు. ముందుగా శ్రీనివాసరావు, గంగారత్నం దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే ఏడాది అమ్మవారికి రూ.70లక్షల వ్యయంతో బంగారు చీర తయారు చేయించేందుకు సంకల్పించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 50 గ్రామాల నుంచి భక్తులు హాజరైనట్టు ఆలయ కమిటీ తెలిపింది.



అన్నపూర్ణ అలంకారంలో..

సామర్లకోట: పంచారామ పుణ్య క్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలా త్రిపు రసుందరి అమ్మవారికి ఆలయ పండితులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని చిత్తానక్షత్ర మందు అన్నపూర్ణ అమ్మవారిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు నిత్యాన్నదాన పథకంలో 400 మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రాణాలు తీసిన ఈత

- ఆడుకోవడానికని వెళ్లి.. అనంతలోకాలకు..
- పంట కాలువలోకి ఈతకోసం దిగి ఇద్దరు విద్యార్థుల మృతి
- కాకినాడ రూరల్ తూరంగిలో విషాదఛాయలు



ఆసుపత్రిలో మృతుడు జక్కి అభిరామ్

కాకినాడరూరల్, అక్టోబరు 4: ఆడుకోవడానికని ఆ బాలలు ఇంటి నుంచి బయటికి వెళ్లారు.. స్నానం చేద్దామని.. ఈత కొడదామనుకుని పంట కాలువలోకి దిగారు.. లోపల బురద ఎక్కువగా ఉండడంతో ఇరుక్కుపోయారు.. మొత్తం నలుగురు కాలువలోకి దిగగా ఇద్దరు చిన్నారులు పంట ఊబిలో కూరుకుపోయి మరణించారు. ఈ విషాదకర సంఘటన కాకినాడజిల్లా కాకినాడరూరల్ మండ లం తూరంగిలో శుక్రవారం జరిగింది. ఆడుకోవడానికి వెళ్లి వస్తానని చెప్పిన కుమారులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రుల రోధన వర్ణనాతీతంగా ఉంది.

ఈత కొడదామని దిగి..



గండికోట దుర్గాప్రసాద్

ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ రూరల్ మండ లం తూరంగి ఉప్పరపేటకు చెంది న చిన్నారులు జక్కి అభిరామ్(8) (2వ తరగతి), గండికోట దుర్గాప్రసాద్(10)(3వ తరగతి), వెంకన్న, కిరణ్ అనే నలుగురు విద్యార్థులు స్థానికంగా ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. దస రా సెలవులు కావడంతో శుక్రవారం మ ధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి బయటకు ఆడుకోవడానికి వెళ్లారు. దగ్గరలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో రామాలయం వెనుక ఉన్న పంట కాలువ వద్దకు వెళ్లారు. నలుగురూ కలిసి స్నానం చేస్తూ ఈత కొడదామని ఆ కాలువలోకి దిగారు. కాలువలో బురద ఎక్కువగా ఉండ డంతో అందులో అభిరామ్, దుర్గాప్రసాద్ ఇద్దరూ కూరుకుపోయారు. బయటకు రాలేని పరిస్థితుల్లో హాహాకారాలు చేస్తున్నారు. దీంతో భయపడిన మిగతా ఇద్దరు చిన్నారులు వెంకన్న, కిరణ్ వెంటనే పరుగు పరుగున ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో విషయం చెప్పారు. వెంటనే తల్లిదండ్రులు, స్థానికు లు అక్కడికి చేరుకుని ఇద్దరినీ బయటకు తీశారు. వారిలో దుర్గాప్రసాద్ అప్పటికే మృతి చెందగా కొన ఊపిరితో ఉన్న అభిరామ్‌ను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో ఇద్దరు విద్యార్థులు క్షేమంగా ఉన్నారని ఎస్ఐ తెలిపారు. మృతుడు అభిరామ్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మార్చురీకి తరలించామని తెలిపారు.

పిల్లల్ని పర్యవేక్షించాలి: ఎస్ఐ

దసరా సెలవులు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పర్యవేక్షిస్తుండాలని, ముఖ్యంగా కాలువలు, సముద్రం, నూతుల వద్దకు పంపించవద్దని ఎస్ఐ వీరబాబు తల్లిదండ్రులకు సూచించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

పోర్టుసిటీ(కాకినాడ), అక్టోబరు 4: సరస్వతీ గానసభ 121వ వార్షిక దసరా సంగీత, నృత్య నాటకోత్సవాల్లో భాగంగా నిర్వహించిన గాత్ర కచేరీ ఆకట్టుకుంది. శుక్రవారం రాత్రి సూర్యకళామందిరంలో కొడవంపల్లి శ్రీరంజని గాత్ర కచేరీ నిర్వహించారు. దీన్ని వీక్షించేందుకు కాకినాడ పరిసర ప్రాంతాల నుంచి సంగీతాభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో కొమ్మిరెడ్డి శ్రీరామనరసింగరావు, పేపకాయల రామకృష్ణ, లక్కరాజు సత్యనారాయణతోపాటు నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరిగా దర్శనం

» రెండో రోజు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు » ప్రత్యేక పూజలు, అలంకరణలు

పిఠాపురం, అక్టోబరు 4: పట్టణంలోని పాదగయ క్షేత్రం కుక్కుటేశ్వరస్వామి వారి సన్నిధిలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరిదేవి, పురుహుతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శతచండీయాగ మహోత్సవాల రెండవ రోజు శుక్రవారం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజరాజేశ్వరీదేవి బాలాత్రిపురసుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాగణపతికి విఘ్నేశ్వరపూజ, కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, కుంకుమార్చనలు జరిగాయి. అష్టాదశ శక్తిపీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్టాన దేవతైన పురుహుతికాఅమ్మవారు మహాకాళి విశేష ఆభరణ అర్చనలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో, సహాయ కమిషనరు విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు: పట్టణంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బస్టాండు, కరణంగారి తోట, ఈబీసీ కాలనీ, నందిరాయి వీధి, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో కనకదుర్గమ్మ ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. కరణంగారితోటలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా అలంకరించారు.



కొత్తపల్లి: పార్వతీదేవిగా కొమరగిరి బాలకనకదుర్గమ్మ



జగ్గంపేటలో అలంకరణ

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో అపర్ణాదేవి బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరించారు. దుర్గాడ శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామి సన్నిధిలో లలితాదేవి చందనధారిణిగా దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. చెందుర్తి జంక్షన్ వద్ద గల కనకదుర్గమ్మ వారికి భక్తులు బోనాలు సమర్పించారు. భవానీ భక్తులు, మహిళలు బోనాలు ఎత్తుకుని ఆలయానికి ప్రదర్శనగా తరలివచ్చారు.

పోర్టుసిటీ(కాకినాడ): నగరంలో ప్రసిద్ధి చెందిన బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు భక్తులకు ఊయల అవతారంలో దర్శనమిచ్చారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవకమిటీ ఛైర్మన్ గ్రంధి బాబ్జి, ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట- కాకినాడ రోడ్‌లో దేవి సెంటర్లో అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవీగా దర్శనమిచ్చారు. పురోహితులు మామిళ్ళపల్లి అయ్యప్ప అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నాళం సూరిబాబు అమ్మవారికి అలంకరణ నిమిత్తం చీరను బహుకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే మంచినీటి చెరువు గట్టు, రావులమ్మ తల్లి ఆలయం వద్ద సత్తెమ్మ తల్లి, నూకాలమ్మ ఆలయాల్లో అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు.

గండేపల్లి: మల్లేపల్లి గ్రామంలో కొత్తూరు జాతీయరహదారి బ్రిడ్జి పక్కన నూతనంగా నిర్మించిన విజయకనక దుర్గమ్మ ఆలయం వద్ద విఘ్నేశ్వర పూజ, ప్రతిష్ట కలశ స్థాపన, సంకల్పం, మండపారాధన, జలాదివాసము, క్షీరాదివాసము నిర్వహించారు. పురోహితులు చింతా అరుణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. మురారి శివారున మామిడితోటలో వేపచెట్టు కింద



గొల్లప్రోలు కరణంగారి తోటలో బాలాత్రిపుర సుందరిగా కనకదుర్గమ్మ



గొల్లప్రోలు మండలం దుర్గాడలో చందనధారిణిగా లలితాదేవి

వెలసిన కనకదుర్గమ్మను భక్తులు దర్శించుకున్నారు.

పెద్దాపురం: పట్టణంలోని వర్ధులవారి వీధిలో భువనేశ్వరీ పీఠంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానంలో ఏసీ విజయలక్ష్మీ, కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానం ఈవో సౌజన్య ఆధ్వర్యంలో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. గాయత్రీదేవిగా అమ్మవారు భక్తులకు నయనానందకరంగా దర్శమిచ్చారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి గ్రామాల్లోని ఆలయాల్లో కనకదుర్గ అమ్మవారిని గాయిత్రిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మవరం విజయదుర్గ ఆలయంలో లలిత సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలను వేద పండితులు తొయ్యేటి పాపారావు నిర్వహించారు.

సామర్లకోట: కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం చెంతన గల స్వయం వర పార్వతి అమ్మవారికి, అలాగే పట్టణంలో పలుచోట్ల అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

కొత్తపల్లి: కొమరగిరిలో గ్రామంలో బాలకనక దుర్గ పార్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు విశేషపూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

'కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి'

ప్రత్తిపాడు, అక్టోబరు 4: కొండరెడ్లకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు నియోజకవర్గ సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులు వాపోయారు. వేళంగి, పెదమల్లాపురం, ఆవిల్తి, అనుమిర్తి, ఓండ్రేగుల గిరిజన గ్రామాల గిరిజనులు శుక్రవారం ప్రత్తిపాడు విచ్చేసి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాకు వినతిపత్రం అందజేశారు. అధికారులు తమకు కుల ధ్రువీకరణపత్రాలు మంజూరు చేయకపోవడంతో పిల్లల చదువుకు ఇబ్బందులు వస్తున్నాయని, ప్రభుత్వ పథకాలు మంజూరులో అవకాశాలు కోల్పోతున్నామని గిరిజనులు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. తమ గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని డ్రైన్‌లు, రహదారులు ఏర్పాటు చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జర్తా మల్లేశ్వరరావు, వెలుగల లక్ష్మణరావు, కోకూరి మల్లేశ్వరరావు, గోము గున్నమ్మ, కృష్ణవేణి అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఫారెస్ట్ అధికారులు

ఎమ్మెల్యే సత్యప్రభను ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గారాంప్రసాద్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.జాన్సన్, సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను కోరారు.

'ఉచిత ఇసుక హామీని తక్షణం అమలుచేయాలి'

పెద్దాపురం, అక్టోబరు 4: ఉచిత ఇసుక హామీని తక్షణం అమలుచేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయ్యిందని అయినా నేటికి కూడా ఇసుక లభించడం లేదన్నారు. అధికార పార్టీ నేతలే ఇసుకపై పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. ఆర్డీవో కార్యాలయ ఏవో మాధవరావుకు వినతి అందచేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నాగు, సత్యనారాయణ, ఇబ్రహీం, శ్రీను, సత్తిబాబు, కృష్ణ తదితరులున్నారు.

'గ్రామాలను అభివృద్ధి చేయాలి'

తాళ్లరేవు, అక్టోబరు 4: ఉపాధి హామీ పథకంతో గ్రామాలను అభివృద్ధి చేసేలా క్షేత్ర సహాయకులు చర్యలు చేపట్టాలని టీడీపీ నేత టేకుమూడి లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం కోరింగ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెయ్యల మంగేష్ అధ్యక్షతన ఉపాధిహామీ పనుల గుర్తింపునకు గ్రామసభ జరిగింది. గ్రామంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల నివేదికను ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. ఈవోపీఆర్డీ ఎమ్.భైరవమూర్తి, టీడీపీనేతలు వాడ్రేవు వీరబాబు, పొన్నమండ రామలక్ష్మి, కృష్ణవేణి ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 4: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సర్పవరం ఎస్‌హెచ్‌వో బొక్క పెద్దిరాజు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ముగ్గురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టు నిర్ధారించి రెండో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి వినర సింహరావు రెండేసి రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ పెద్దిరాజు తెలిపారు.

తుని రూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వారికి తుని ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి జరిమానాలు విధించారు. 12 మందికి ఒకొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

జగ్గంపేట, అక్టోబరు 4: కూలీ పని చేసుకునే మల్లిసాలకు చెందిన మాతా సత్తిబాబు గురువారం రాత్రి పెరుగు ప్యాకెట్ తీసుకోవడానికి మోటారు సైకిల్‌పై జగ్గంపేట జాతీయ రహదారిపైకి వెళ్లాడు. తిరిగి రోడ్డు దాటుతుండగా జగ్గంపేట నుంచి మల్లిసాల వైపు వెళ్తున్న ఆటో ఢీకొంది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు.జగ్గంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'అక్నూ'లో ఎంబీఏ, ఎంసీఏ స్పాట్ అడ్మిషన్లు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 4: కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో మిగిలిపోయిన 16 ఎంబీఏ సీట్లు, 25 ఎంసీఏ సీట్లకు అర్హులైన అభ్యర్థులతో స్పాట్ అడ్మిషన్‌లో భర్తీ చేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎస్ ప్రశాంతశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ఐసెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో ముందు కౌన్సిలింగ్‌లో మిగిలిపోయిన ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్ విధానంలో భర్తీ చేస్తారన్నారు. అర్హత గల విద్యార్థులు ఐసెట్ ర్యాంకు కార్డుతో పాటూ విద్యార్హతలకు చెందిన ధ్రువపత్రాలతో శనివారం రాజమహేంద్రవరం అక్నూ యూనివర్సిటీలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని కోరారు.

7న కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, అక్టోబరు 4: కాకినాడ వికాసలో ఈ నెల 7న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీలు, సంస్థల్లో కస్టమర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, గోల్డ్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, బ్రాంచ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్, టెక్నీషియన్, హెల్పర్, కెమిస్ట్, టెలీసేల్స్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లో వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు.

7 నుంచి దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణా శిబిరం

కాకినాడ సిటీ, అక్టోబరు 4: కాకినాడ కచేరీపేటలోని యూటీఎఫ్ హోంలో ఈనెల 7 నుంచి 9 వరకు దేశభక్తి, అభ్యుదయ గీతాల శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.సంజయ్, ఎ.వాసు తెలిపారు. దసరా సెలవుల సందర్భంగా రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులంతా హాజరు కావాలని కోరారు.

ఎస్‌పీఈ స్టూడెంట్ చాప్టర్ ఆవిర్భావ వేడుకలు

జేఎన్టీయూకే, అక్టోబర్ 4: వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో యూసీఈకే పీఈ, సీఈ విభాగాల ఆధ్వర్యంలో జేఎన్టీయూకే ఎస్‌పీఈ స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించి 12ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఓఎన్‌జీసీ ఈడీఏ రత్నేష్‌కుమార్, ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ పాల్గొన్నారు. రత్నేష్‌కుమార్ మాట్లాడుతూ వర్సిటీ అధ్యాపకులకు, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు ఓఎన్‌జీసీ సహకారమందిస్తుందన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఎస్‌పీఈ స్టూడెంట్ చాప్టర్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గానికి అతిథులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఇంజనీరింగ్ అధికారిగా సత్యప్రకాష్

ప్రత్తిపాడు, అక్టోబరు 4: ప్రత్తిపాడు మండల ఇంజనీరింగ్ అధికారిగా ఎం.సత్యప్రకాష్ బాధ్యతలు చేపట్టారు. కోరుకొండ మండలం ఇంజనీరింగ్ అధికారిగా ఆయన పని చేస్తూ బదిలీపై ఇక్కడ చేరారు. ఇప్పటివరకు పనిచేసిన ఎస్.నాగేశ్వరరావు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన సత్యప్రకాష్‌ను ఎంపీపీ గోళ్ళ క్రాంతిసుధాకర్, ఎంపీడీవో ఎంవీఈ.కుమార్, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

ఏలేశ్వరం, అక్టోబరు 4: ఏలేశ్వరం ఆర్టీసీ డీపో ఉద్యోగులు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఉద్దగిరి యూబీఎం కుమార్ నేతృత్వంలో ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎంయూ, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఐక్యంగా ఏర్పడి కండక్టర్ ఎస్.శ్రీనివాస్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో రమణ, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం'

పిఠాపురం, అక్టోబరు 4: పట్టణంలోని ది పిఠాపురం అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ(పూర్వ అర్బన్ బ్యాంకు)కి జరుగుతున్న ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుందామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కల్యాణమండపంలో శుక్రవారం వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీల రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు ఇరుపార్టీల నేతలు కలిసి చర్చించి ఎన్‌డీఏ తరపున 5 వార్డుల్లో డైరెక్టరు పదవులకు అభ్యర్థులను పోటీలో నిలిపామని తెలిపారు. 1వ వార్డు నుంచి విశ్వ వీరవెంకట నాగేశ్వరరావు, 2 నుంచి చెల్లుబోయిన ప్రమీల, 3 నుంచి అద్దంకి వెంకటరమణ, 4 నుంచి ఆరిగెల ప్రసాదరావు, 5వ వార్డు నుంచి మేళం రామకృష్ణను బలపరుస్తున్నట్లు చెప్పారు. 1,3 వార్డుల్లో టీడీపీ తరపున, 2,4,5వార్డుల్లో జనసేన తరపు అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. చైర్మన్ పదవి జనసేనకు, వైస్‌చైర్మన్ పదవి టీడీపీకి కేటాయించినట్లు తెలిపారు. అంతకుముందుకు జనసేన నేతలు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మల మధ్య ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చలు జరిగాయి. సమావేశంలో కూటమి బలపరిచిన అభ్యర్థులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

కాకినాడ రూరల్, అక్టోబరు 4: ఏపీ అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 2నుంచి 8వతేదీ వరకూ నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కాకినాడ వివేకానంద ఉద్యానవనంలోని గ్రంథాలయంలో 4వ తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం సహజీవనం ద్వారా వన్యప్రాణుల సంరక్షణపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 34 పాఠశాలలు, కళాశాలల నుంచి 286 మంది విద్యార్థులు పాల్గొన్నారని జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్య అతిథిగా ఫారెస్ట్‌రేంజర్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో యూఎన్‌డీపి సమన్వయకర్త హర్ష, బాలవేదిక కన్వీనర్ బలరామకృష్ణ, పిల్లి గోవిందరాజులు, రమణమూర్తి, లైబ్రేరియన్ శ్రీనివాసరావు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ఏలేశ్వరం, అక్టోబరు 4: వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సునీత నేతృత్వంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అటవీశాఖ అధికారి దుర్గారాంప్రసాద్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రగడ ప్రయాగమూర్తి, జాన్సన్, మీనాక్షి, ఈశ్వర్ రెడ్డి, సురేష్ కుమార్, బంగార్రాజు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 4: ప్రాణాపాయంలో ఉన్న 33 రోజుల వయస్సు కలిగిన ఆడశిశువుకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు ప్రత్యేక ట్రాకియోస్టోమీ శస్త్రచికిత్సను నిర్వహించి పునర్జన్మను అందించారు. కానీ కార్డియాక్ అరెస్ట్ కారణంగా శిశువు మరణించింది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్వాస, ఆహారం తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడుతున్న 33 రోజుల ఆడశిశువుకు జీజీహెచ్ పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ వైద్యబృందం పరీక్షించి ఎయిర్ వే ట్యూబ్ 95శాతం కుదించబడిందని గుర్తించారు. కష్టతరమైన శస్త్రచికిత్సను అత్యవసర ట్రాకియోస్టోమీ విధానం ద్వారా నిర్వహించారు. కానీ, శిశువు పూర్తిగా తేరుకుంటుందనుకున్న సమయంలో దురదృష్టవశాత్తూ కార్డియాక్ అరెస్ట్‌కు గురై మరణించిందని విచారం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల ఉపకరణాలను పరిశీలించిన ఎమ్మెల్యే

జగ్గంపేట, అక్టోబరు 4: జగ్గంపేటకు చేరుకున్న దివ్యాంగుల ఉపకరణాలను శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 7 ఉదయం 9గంటల వరకు జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసే శిబిరంలో దివ్యాంగులకు వీటిని అందిస్తామని తెలిపరు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర, టీడీపీ నేతలు మారిశెట్టి భద్రం, బదిరెడ్డి అచ్చన్న దొర, గల్లా రాంబాబు, కొండ్రోతు శ్రీను, మండల అభివృద్ధి అధికారి, ఏపీవో కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువపై శాశ్వత వంతెన నిర్మాణం

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, అక్టోబరు 4: ఏలేరు కాలువపై శాశ్వత వంతెన నిర్మాణానికి కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలపారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో ఏలేరు కాలువపై తాత్కాలిక వంతెన నిర్మాణానికి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దబ్బకాలువపై నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక వంతెన నిర్మాణం ప్రస్తుతానికి చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. త్వరలోనే శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎలిశెట్టి నాని, గవర సాన శివ రామకృష్ణ, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

సామర్లకోట: ఆధ్యాత్మిక కార్యక్రమాల పేరిట ఆయా ఉత్సవ నిర్వాహకులు అన్నదానాలు



పెద్దాపురం: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

చేయడం ఎంతో విలువైనదని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పట్టణ పరిధిలో సత్యనారాయణ పురం మినీ వ్యాన్ అసోసియేషన్ ఆవరణలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే వడ్డించి ప్రారంభించారు. సుమారు 2 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మినీ వ్యాన్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన తోట సుధీర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 4: ఇటీవల రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నూతన ఛైర్మన్‌గా నియమితులైన తోట సుధీర్ కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్ మీనాను శుక్రవారం మర్యాదపూర్వకంగాకలవగా శుభాకాంక్షలు చెప్పారు.

మేనేజర్, అకౌంటెంట్లకు స్థానచలనం

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 4: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మేనేజర్ కర్రి సత్యనారాయణ, అకౌంటెంట్ కేఎస్ శిరీష్ కుమార్‌లకు స్థాన చలనం చేస్తూ కమిషనర్ భావన ఆదేశాలు ఇచ్చారు. మేనేజర్‌గా శిరీష్‌కుమార్, అకౌంటెంట్‌గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టనున్నారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం

కిర్లంపూడి, అక్టోబరు 4: జగపతినగరంలో రైతు సేవా కేంద్రాన్ని ఎంపీపీ తోట రవి ప్రారంభించారు. సర్పంచ్ శ్రీలత రాంబాబు, ఏవో జోకా అమృత, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, కుర్ల చినబాబు తదితరులున్నారు.



గొల్లప్రోలులో ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

భవన నిర్మాణ కార్మికుల ధర్నాలు

గొల్లప్రోలు, అక్టోబరు 4: ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గొల్లప్రోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ తక్షణం ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని, ఇందు లో దళారుల జోక్యాన్ని నివారించాలని నినాదాలు చేశారు. ఆందోళనలో ఆయా సంఘాల నేతలు నందీశ్వరరావు, పెద్దింటి రమణ, కె.చిన్నా, టి.రవి, డి.ఆనందరావు, రాంబాబు, శ్రీను, ఉలవల కొండ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ సీపీఎం అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పిఠాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహశీల్దార్ కార్యాలయంలో వినతి అందజేశారు. సీపీఎం, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు కుంచే చిన్నా, కోనేటి రాజు, నాగేశ్వరరావు, మణి, డేగల సత్యనారాయణ, రమణ, వీరబాబు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

'అర్హులందరికీ జాబ్ కార్డులు'

కొత్తపల్లి, అక్టోబరు 4: అర్హులందరికీ ప్రతీ ఒక్కరికి ఉపాధి పథకంలో జాబ్‌కార్డులు మంజూరు చేస్తామని కొత్తపల్లి సర్పంచ్ గవర భవానీనాగేశ్వరరావు, పంచాయతీ కార్య దర్శి సూర్యనారాయణమూర్తి తెలిపారు. కొత్తపల్లి చెత్తసం పద కేంద్రంలో శుక్రవారం ఉపాధికూలీలకు జాబ్ కార్డులు మంజూరు, చేపట్టే పనులపై జరిగిన సమావేశంలో మాట్లాడారు.

వేట్లపాలెంలో పోలీసు బందోబస్తు

సామర్లకోట, అక్టోబరు 4: వేట్లపాలెంలో భేతాళస్వామి నవ రాత్రి ఉత్సవాల్లో ప్రారంభంలో భాగంగా 2 సామాజిక వర్గాల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదం ఘర్షలకు దారితీయడంతో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఆలయం వద్ద పెద్దఎత్తున పోలీసు బందోబస్తు చేపట్టారు.

'నిరుపేద కాపుల అభ్యున్నతికి కృషి'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 4: కాపు సామాజికవర్గంలో ఉన్న నిరుపేదల సంక్షేమం, అభ్యున్నతికి కృషిచేస్తామని జాతీయ కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వాకలపూడిలో జాతీయ కాపు సంఘం జిల్లా సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రవిచంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి ప్రధాన కేంద్రంగా జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్ర మురళీకృష్ణ నాయుడు నాయకత్వంలో 9 రాష్ట్రాల్లో ఈ సంఘం విస్తరించి ఉందన్నారు. గతనెల 29న కాకినాడలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేసిందన్నారు. కాపు సామాజిక వర్గంలో ఉన్న వారి అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.10 వేల కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉలకాయల వీరబాబు, రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి రాము, గౌరవాధ్యక్షులు బసవా శ్రీనివాసు, ఎం.మాలతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కామిశెట్టి సత్యవేణి, డి.బాబులు పాల్గొన్నారు.

గ్రావెల్‌తో రోడ్డును పూడ్చిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 4: నగరంలోని మూడో వంతెన ముత్తా గోపాలకృష్ణ వారధి ఐటీఐ రోడ్డు వైపు గోతులు మాయమైన రోడ్డుపై 'చెరువు కాదు రహదారే.' కథనానికి అధికారులు స్పందించారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన అధికారులు గ్రావెల్‌తో రోడ్డును పూడ్చారు. దీంతో వాహనదారుల ప్రయాణం సులభతరమైంది.

'ఈ - పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు'



ఈ - పంట నమోదును పరిశీలిస్తున్న మల్లిఖార్జున

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్, అక్టోబరు 4: రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ - పంటలో నమోదు చేసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు పొందుతారని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మల్లిఖార్జున తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు, పిఠాపురం మండలం అగ్రహారం, విరవాడ, కోలంక గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ-పంటలో నమోదు చేసిన మిశ్రమపంటలు అయిన ఆయిల్‌పామ్, కొబ్బరి, అరటి, కాయగూర పంటలు సాగు చేస్తున్న పొలాలను పరిశీలించారు. ఆయన వెంట పిఠాపురం ఉద్యానవనశాఖాధికారి కె.శైలజ తదితరులు ఉన్నారు.

ఆర్డీవోగా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లిబాబు

కాకినాడ సిటీ, అక్టోబరు 4: కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారిగా శ్రీపాద మల్లిబాబు శుక్రవారం ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఎన్నికల అధికార కార్యాలయం డిప్యూటీ సీఈవోగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ ఆర్డీవోగా నియమితులయ్యారు. తొలుత జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వోలను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ రెవెన్యూ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, డివిజన్ పరిధిలోని మండలాల తహశీల్దార్‌లు కలిసి అభినందనలు తెలిపారు.

రత్నగిరిపై ఘనంగా చండీహోమం

అన్నవరం, అక్టోబరు 4: రత్నగిరి వనదేవత వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ రోహిత్, ఏఈవో కొండలరావు, సూపరెంటెండెంట్లు కోటమర్తి సతీష్, ఐ.వి రామారావు తదితరులు పాల్గొన్నారు. వైదిక కార్యక్రమాలను వనదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ, చక్రపల్లి ప్రసాదశర్మ తదితరులు నిర్వహించారు.

తపోవనంలో యనమల పూజలు

తుని రూరల్, అక్టోబరు 4: ప్రముఖ ఆధ్యాత్మిక పీఠం తపోవన క్షేత్రంలో శరన్నవరాత్రి వేడుకలు పురస్కరించుకుని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పీఠాధిపతి శ్రీ సచ్చిదానంత సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యనమల, పార్టీ ముఖ్య నాయకులు స్వామిజీ ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, యినుగంటి సత్యనారాయణ, చింతమనీడి నాగ సోమరాజు, కుసుమంచి సత్యనారాయణ, జక్కాన రామునాయుడు తదితరులున్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం

తొండంగి, అక్టోబరు 4: ఏవినగరంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని మాసాభిషేకం వైభంగా జరిగింది. స్వామివారి మూలవిరాట్‌కు వేదమంత్రోచ్చారణ నడుమ పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అలంకారం అర్చన జరిపి ప్రత్యేక పదార్థాలు నివేదించారు. ఆలయంలో శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు జరిగాయి. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యనమల నాగేశ్వరరావు బాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'ఆదిత్య'లో సర్టిఫికేషన్ ప్రోగ్రాం


గండేపల్లి, అక్టోబరు 4: సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, ఏఐ అండ్ ఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన డేటా విజువలైజేషన్ విత్ పవర్ బీఐ, టేబ్లూ అనే ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రాం ముగిసింది. డేటా విజువలైజేషన్ అత్యాధునిక పవర్ బిఐ టూల్స్ వాడకాన్ని నూతన అంశాలతో కూడిన పాఠ్యాంశాలను రిసోర్స్‌పర్సన్ డాక్టర్ ఎం.వెంకటేష్ బోధించారు.

ఇసుక ర్యాంపు పరిశీలన

గండేపల్లి, అక్టోబరు 4: మండలంలో నాయకంపల్లి, కోటపాడు సమీపంలో నిల్వ ఉంచిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఫిర్యాదుపై తహశీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ ఇసుక ర్యాంపు రంగంపేట మండలం కోటపాడు పరిధిలోకి వస్తుందని అధికారులు చెప్పినట్టు తహశీల్దార్ తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళం

కాకినాడ సిటీ, అక్టోబరు 4: వరద బాధితుల సహాయార్థం కాకినాడ నగర ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రూ.3లక్షల60వేల విరాళం చెక్కును అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పాలడుగు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు వైడీ రామారావు, కార్యదర్శి నరసింహారావు, కోశాధికారి రామనాదం పాల్గొనగా ప్రతినిధులను సీఎం అభినందించారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న దృశ్యం